ఈనాడు
హనుమకొండ
బుధవారం అక్టోబరు 16, 2024

ఇదేం తీరు.. ఇవేం గొడవలు!

వరంగల్ నేతలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వర్గపోరును అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించింది. ఇక్కడి ప్రజాప్రతినిధుల తప్పటడుగులపై ఆగ్రహంగా ఉంది. గీసుకొండ మండలం ధర్మారంలో ఏర్పడిన ఫ్లెక్సీ వివాదంలో దాడులు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? దీని వెనుక ఎవరెవరు ఉన్నారు? కిందిస్థాయి కార్యకర్తలను కట్టడి చేయాల్సిన ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నేరుగా గీసుకొండ పోలీసు స్టేషన్‌కెళ్లడం తదితర కీలక అంశాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వద్దకు నివేదిక చేరింది. మరోవైపు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్య నాయకులు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపదాస్ మున్షిని కలిసి మంత్రి సురేఖ వ్యవహరిస్తున్న తీరు గురించి వివరించినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు మంత్రి సురేఖ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గీసుకొండ పోలీసు స్టేషన్‌లో జరిగినవి, ధర్మారంలో పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులు తదితర అంశాలు వివరించినట్లుగా సమాచారం. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉమ్మడి జిల్లా రాజకీయాలు హైదరాబాద్ కేంద్రంగా నడిచాయి. బుధవారం సీఎం, పీసీసీ అధ్యక్షుడిని కలిసేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారని సమాచారం.'

'మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యత ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అధిష్ఠానం అప్పగించింది. ఒకటి, రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది'

పార్టీకి నష్టం: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య దూరం పెరగడంపై కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు సీరియస్‌గా ఉన్నారు. చిన్నా చితక విషయాలు పెద్దవి చేసి తరచూ గొడవ పడటం వల్ల పార్టీకి నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గాంధీ భవన్‌లో వ్యాఖ్యానించినట్లుగా తెలిసింది.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి.. 6లో..

ఆర్టీసీ పండగ చేసుకుంది..!



● 14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం

దసరా ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

● వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.

● అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.

● 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..

● మొత్తం 50 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే


హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

డిపోల వారీగా వివరాలు

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)	తిరిగిన కి.మీ(లక్షల్లో)	ఓ.ఆర్ (శాతం)
హనుమకొండ	3.73	6.72	81
జనగామ	3.38	6.16	94
వరంగల్ 1	4.67	7.82	83
వరంగల్ 2	3.93	7.16	86
మహబూబాబాద్	2.03	3.46	103
నర్సంపేట	2.84	4.92	96
పరకాల	2.23	3.79	98
తొర్రూరు	3.29	5.52	104
భూపాలపల్లి	2.85	4.75	97

సిబ్బంది, అధికారుల కృషి వల్లే..

- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్



ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు


ఉత్తర్వు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, చిత్రంలో డీఈవో వాసంతి తదితరులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికైన 168 మంది ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు కోసం మంగళవారం కలెక్టరేట్‌లో మ్యాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని అధికారులు తొలుత ప్రకటించారు. నూతన ఉపాధ్యాయులు కేంద్రానికి చేరుకున్నాక వాయిదా వేసి, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ప్రారంభించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డీఈవో డి.వాసంతి, జడ్పీ సీఈవో విద్యాలత పర్యవేక్షించారు. పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. వారికి కేటాయించిన పాఠశాలల్లో బుధవారం చేరాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు. కౌన్సెలింగ్ రాత్రి వరకు కొనసాగింది.

వసతులు లేక అసహనం: కౌన్సెలింగ్‌కు వచ్చిన నూతన ఉపాధ్యాయులు గందరగోళానికి గురయ్యారు. ఉద్యోగంలో చేరుతున్నామనే ఆశతో వివిధ ప్రాంతాల నుంచి సమయానికి కేంద్రానికి వచ్చిన వారికి కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు విద్యాశాఖ అధికారులు తెలపడంతో కంగుతిన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాక సమాచారం ఇస్తామని జిల్లా అధికారులు చెప్పడంతో వెనుదిరిగారు. మార్గంమధ్యలోకి వెళ్లిన తర్వాత మధ్యాహ్నమే కౌన్సెలింగ్ ఉంటుందని సమాచారం రావడంతో మళ్లీ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో కలెక్టరేట్ ఆవరణలో కిందనే కూర్చున్నారు. అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

గుట్టను గుల్ల చేసి.. ఇళ్లు కట్టేసి!



ఈనాడు, వరంగల్, న్యూశాయంపేట, న్యూస్‌టుడే: అది ప్రభుత్వ స్థలంలోని పెద్ద గుట్ట.. కబ్జాదారులు కన్నేసి దానిపై ఒక్కో ఇల్లు అంటూ ఏకంగా ఓ కాలనీనే నిర్మించారు. హనుమకొండ నగరంలో రాజకీయ నేతల పలుకుబడితో యథేచ్ఛగా చేసిన భూ దందా ఇది.. నాలుగేళ్లుగా ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా అడిగే అధికారి లేరు. హనుమకొండ జిల్లా న్యూశాయంపేటలోని 31వ డివిజన్‌లో సర్వే నెంబరు 579లో 39 ఎకరాల విస్తీర్ణంలో మాలగుట్ట ఉంది. దీని చుట్టూ 2006 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలను వేసుకొని జీవిస్తుండగా గత ప్రభుత్వ హయాంలో 150 మందికి పైగా ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. ఇక్కడ దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. పేదలకు పట్టాలిచ్చినప్పుడు తామెందుకు గుట్టను ఆక్రమించుకోకూడదని కొందరు భావించారు. మాజీ ప్రజాప్రతినిధుల అండదండలతో 25 ఇళ్లను నిర్మించి ఒక కాలనీనే తయారు చేశారు. కొందరు 55 గజాలు, మరికొందరు 40 గజాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టను ఇష్టారాజ్యంగా చదును చేశారు. పాత పట్టా నెంబర్లను సాకుగా చూపి మునిసిపల్ కార్యాలయం నుంచి ఇంటి నెంబర్లు, విద్యుత్తు మీటర్లు, నల్లా కనెక్షన్లు పొంది గృహ నిర్మాణాలను చేపట్టారు. కాలనీకి గత అసెంబ్లీ ఎన్నికల ముందు బోర్డు పెట్టి ఆ తర్వాత తొలగించారు.

● మాలగుట్టలో అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని కాజీపేట తహసీల్దార్ బావుసింగ్ అన్నారు. సర్వేయర్, ఆర్‌ఐలతో సర్వే జరిపి ఇంటి నిర్మాణాలను తొలగిస్తామన్నారు. గతంలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన వాటిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీ బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు హనుమకొండ వేయి స్తంభాల గుడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయాలని, పల్లెల నుంచి ఛాంపియన్లను తయారు చేయాలనే లక్ష్యంతో సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీలో నగర వాసులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు..

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు కొలతలు, పోలీస్, రవాణా శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈనెల మూడో వారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి అనురాధ, సీసీఐ మేనేజర్ జితేందర్, ఎంపీఐ వేణుగోపాల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోండి..

హనుమకొండ కలెక్టరేట్: జిల్లాలో సఖి కేంద్రం సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సఖి సేవల గోడపత్రికలను, వీడియోను ఆమె ఆవిష్కరించారు. సమస్యలున్న మహిళలు వాట్సప్ 7382983088, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక (జేవీవీ) నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, చెకుముకి సంబరాల బాధ్యులు నిట్ విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత వేణు, విద్యావిభాగం కన్వీనర్ కుమారస్వామి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల స్థలం పరిశీలన

పరకాల: నియోజకవర్గానికి మంజూరైన సమీకృత గురుకుల పాఠశాల స్థలాన్ని కలెక్టర్ పి.ప్రావిణ్య పరిశీలించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన రాజిపేట శివారులో కేటాయించిన 19.34 ఎకరాల ప్రభుత్వ స్థలంలో చదును చేసే పనులు పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

● పరకాలలో ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇక్కడి పశు వైద్యశాలను తనిఖీ చేశారు. పశు సంవర్ధక, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.


ఆత్మకూరు పాఠశాలలోఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావిణ్య

విద్యార్థుల మరుగుదొడ్లు ఇలానా?

ఆత్మకూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పాఠాలు బోధించాలని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. ఆత్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు చూసి అసహనం వ్యక్తం చేశారు. తక్షణం కొత్తవి నిర్మించాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆరా తీశారు. విద్యావనరుల కేంద్రంలో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువును పొడిగించినట్లు కేంద్ర సంచాలకులు ఆచార్య వి.రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

17న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి తాబేటి రాజేందర్ తెలిపారు. ఈ నెల 17న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా క్రీడాకారులు గురువారం ఉదయం 9 గంటలకు జేఎన్ స్టేడియంలో హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన బాలికలు ఈ నెల 18 నుంచి 20 వరకు వరంగల్ ఎనుమాముల మార్కెట్ సమీపంలోని ఇన్‌ఫ్యాట్ జీసస్ పాఠశాలలో జరిగే 11వ రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం 6లో..

అద్దె భవనాలు.. అరకొర వసతులు

● గురుకులాల్లో విద్యార్థుల అవస్థలు ● బకాయిలు చెల్లించాలని యజమానుల గగ్గోలు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకులాలు కొన్నింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలినవి అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకైన గదుల్లో వందల మంది ఉంటున్నారు. అద్దె బకాయిలు పేరుకుపోయి యజమానులు భవనాల మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదు.

– న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్, కాజీపేట టౌన్, ధర్మసాగర్

కాజీపేట మండలం కడిపికొండలోని అద్దె భవనంలో కొనసాగుతున్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ఇది. ఇక్కడ 2017 నుంచి గురుకుల పాఠశాల కొనసాగుతోంది. ఐదు నుంచి పదో తరగతి వరకు 330 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటి వరకు పది నెలల అద్దె బకాయి ఉంది. అయినా యాజమాన్యం ఇబ్బంది పెట్టకుండా సహకరిస్తున్నారని ప్రిన్సిపల్ తనుగుల శ్రీనివాస్ తెలిపారు. మూడు నాలుగు రోజుల్లో ఆరు నెలల అద్దె డబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు.





ఇది ధర్మసాగర్ మండలంలోని కరుణాపురంలో నిర్వహిస్తున్న శాయంపేటకు చెందిన మహాత్మ జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల కళాశాల. క్రైస్తవ సంస్థకు చెందిన భవనంలో కొనసాగుతోంది. 370 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శాయంపేటలో సరైన భవనం లేకపోవడంతో ఇక్కడ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో రెండు నెలల అద్దె రూ.6 లక్షలు బకాయి ఉన్నట్లు ప్రిన్సిపల్ విజయజ్యోతి తెలిపారు. యాజమాన్యం అద్దె కోసం ఎలాంటి ఇబ్బందులు పెట్టడం లేదని చెప్పారు.

ఈ రోజే మూడు నెలల బకాయిలు విడుదలయ్యాయి.

- వెంకటప్రసాద్, జిల్లా సమన్వయకర్త, మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ సంక్షేమ గురుకులాలు

జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకులాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి మూడు నెలల అద్దె బకాయిలు మంగళవారం విడుదలయ్యాయి.

జిల్లాలో గురుకులాలు	ఎస్సీ : 12	బీసీ : 10	మైనారిటీ : 05
మొత్తం విద్యార్థులు	7,680	4,279	1450
సొంత భవనాలు ఉన్నవి	06	05	03
అద్దె భవనాల్లో	06	05	02
అద్దె బకాయిలు	రూ.40 లక్షలు	రూ.1.46 కోట్లు	రూ.1.44 కోట్లు

సన్నాలకు రూ.500 బోనస్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: సన్నరకం వరి ధాన్యం క్వింటాకు ప్రభుత్వం రూ.500 బోనస్‌గా చెల్లిస్తుందని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు మద్దతు ధర రూ.2320, బి గ్రేడ్‌కు రూ.2300 చెల్లిస్తున్నట్లు చెపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగపద్మజ, డీఎస్‌వో ఉమారాణి, తహసీల్దార్ జగత్‌సింగ్, వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, ఏకేపీ ఏపీఎం రవీందర్, ఏఈవో చందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు ఎలిగేటి, సుకినే సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, శనిగరం వెంకటేష్, శీలం అనిల్‌కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం



ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధ వారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి కాలంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే

ఆ బాధ తెలుసు కాబట్టే..

- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ



మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం చూశాక ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఈ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

లక్షన్నర మందికి

- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, ఫంక్షన్



హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాను. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం. ● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.

మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నాయని నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు



లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. ఇటీవల ఎన్ఐటీ ఆచార్యుడు సి.ప్రసాదు తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.



ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇవ్వాలి. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలున్నాయి.

అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు. ● కుళ్లిన ఆహార పదార్థాలను చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం

- బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
- ఆకుకూర కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
- బ్రెడ్ గడువులోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
- దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకొని తెచ్చుకోవాలి.
- తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి
- పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
- ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా తగ్గించవచ్చు.
- అదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
- ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
- ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమానులకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

పది హేను సంవత్సరాలుగా

- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం



పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకుల్ల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడపత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.

ఇంటి ఆహారంలోనే..

- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డేపల్లి



ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పాడవకుండా ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడు పోని కూరగాయలు వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.

నాలుగేళ్లుగా అన్నదానం

- నార్లపురం రాజు

మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ ఛాలెంజ్, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సహృదయ ఆశ్రమం, సాయి అనాథ సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హౌజ్ ఆఫ్ జాయ్ ఉంటాయి..

ప్రజల్లో అవగాహన పెరిగింది..

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్




ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

అంకెల్లో వివరాలు..

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో 10

ఇంటిలో..	1
హాస్టళ్లలో..	2
హోటళ్లలో	3
ఇతర	2



రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మించారు. రుణం వస్తుందని ఆశ పడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిచాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువ చేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఓదేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ.39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెస్సై భాను ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ప్రావిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రావిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రావిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http:///waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం

● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ నగరంలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం



చేసినా చర్యలు శూన్యం.

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షల చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ చుట్టూ 15 నుంచి 20 ఎకరాల వరకు సమీప రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకొని సాగు చేసుకుంటున్నారు.

● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మర్రిచెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.

● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.

● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.

● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

హద్దులను నిర్ణయిస్తాం..

- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ణయించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తే. . సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనీల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు


వెంకటాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి నాంది అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్‌గా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తరించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా.. ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, అధ్యాపకురాలు శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సమ్మారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

మరిపెడ, న్యూస్‌టుడే: దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంతో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండాప్రకాష్

ప్రమాదాలు జరిగే చోటే రక్షణ మరిచారు


ఎల్లాపూర్‌లోని వంతెనపై రెయిలింగ్ లేని ప్రదేశం

హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని జాతీయ రహదారి వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన అధికారులు రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అయితే ప్రమాదం లేని చోట (కింది వైపు రోడ్డుకు ఇరువైపులా) ఏర్పాటు చేసి, ప్రమాదం పొంచి ఉన్న చోటే వదిలేశారు. దీంతో రాత్రిపూట వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర ప్రదేశమని గుర్తించి కూడా నిర్లక్ష్యంగా వదిలేయడం తగదని అంటున్నారు. పూర్తి స్థాయిలో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భీమారం

కలెక్టర్ ఆదేశించినా స్పందించరా!


వంగర క్రాస్ వద్ద కంకర తేలిన రోడ్డు

భీమదేవరపల్లి మండలం వంగర క్రాస్ రోడ్డు వద్ద కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న రహదారి పరిస్థితిపై కలెక్టర్ ఆదేశాలను గుత్తేదారు బేఖాతరు చేస్తున్నారు. ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వేసిన రోడ్డు కేజీబీవీ వద్ద కంకర తేలింది. ఇటీవల కస్తూర్బాను సందర్శించేందుకు వచ్చిన కలెక్టర్ ప్రావిణ్య అధ్వాన రోడ్డును చూసి స్పందించారు. తక్షణం మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

– న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

పచ్చదనం మాటున ముప్పు


హసన్‌పర్తి మండలం ముచ్చర్ల చెరువులో పెరిగిన తుంగ

పచ్చదనం పరుచుకున్న ఈ చిత్రం చూసి పార్కో, క్రికెట్ మైదానమో అనుకుంటే పొరపాటే. ఇది జల వనరుకు ముప్పుగా మారిన గుర్రపుడెక్క. హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని పెద్ద చెరువులో పెరిగి, క్రమక్రమంగా నీళ్లు కనిపించకుండా మొత్తం ఆక్రమించేసింది. నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మత్స్యకారులే అప్పుడప్పుడు కొంత తొలగించి చేపలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భీమారం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాలసముద్రం, న్యూస్‌టుడే: మరమ్మతుల పనుల కారణంగా శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం హనుమకొండ డీఈ సాంబరెడ్డి తెలిపారు. అలాగే కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు.

వందశాతం చేప పిల్లలను పంపిణీ చేయాలి

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: మత్స్యకారులకు ఉపాధి కల్పన కోసం వందశాతం చేప పిల్లలను పంపిణీ చేయాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు బుస్సా మల్లేశం, కొత్త సోమయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం హనుమకొండ మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ఎనిమిదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందని గుర్తు చేశారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం మాత్రమే పంపిణీ చేస్తోందని చెప్పారు. ఆగస్టులో చేపట్టాల్సిన కార్యక్రమాన్ని అక్టోబరులో మొదలు పెట్టారని, ఫలితంగా వేసవి వరకు చేపల ఎదుగుదల ఆశించినంత ఉండదన్నారు. అందుకని 92 నుంచి 100 మిల్లీమీటర్ల పొడవైన చేప పిల్లలను చెరువులో వదిలితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు శీలం పృథ్వీరాజ్, పిట్టల సత్యనారాయణ, పెండ్యాల జగదీశ్, రాంబాబు, సుధాకర్, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ


అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

రైల్వే స్టేషన్‌లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు



కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ బృందం, కాజీపేట పోలీసులు సంయుక్తంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్లు జె.సురేష్, వై.సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ శివకేశవులు, ఎస్సైలతో కలిసి సోదా చేశారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయాలు చేస్తూ కనిపించినా 8712584473 నెంబరుకు ఫోన్ చేయాలని ప్రయాణికులకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, తగిన పారితోషికాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు చేసుకోండి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి, రాష్ట్ర సహా అధ్యక్షులు రఘోత్తంరెడ్డి, బండ రమేష్ కోరారు. మంగళవారం ధర్మసాగర్‌లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఓటుహక్కు నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు పి.సరస్వతి, అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాన్‌సింగ్, తులసి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


సూర్యకుమార్ (పాత చిత్రం)

వేలేరు, న్యూస్‌టుడే: మండలంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. పీచరకు చెందిన కంకణాల యాదకుమార్, కోమల దంపతుల చిన్న కుమారుడు సూర్యకుమార్ (20) ఇంటివద్ద ఉంటూ వ్యవసాయంలో తల్లిదండ్రులకు సహకరిస్తున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యకుమార్ ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

జూద కేంద్రంపై పోలీసుల దాడి

వరంగల్‌క్రైం: జూద కేంద్రంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... ఎనుమాముల మార్కెట్ శివారుల్లో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎనుమాముల పోలీసులతో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. జూదం ఆడుతున్న ఏడుగురిలో ఒకరు పారిపోగా.. ఆరుగురుని అదుపులోకి తీసుకొని, రూ.15,930 నగదు, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు.

గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: నిషేధిత గుట్కాను అక్రమంగా నిలువ ఉంచిన కేంద్రంపై తమ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. టైలర్‌స్ట్రీట్‌లో ఆర్.మనీష్ వద్ద గుట్కా ఉన్నట్లు సమాచారం రావడంతో హనుమకొండ పోలీసులతో కలిసి దాడి చేశారు. రూ.2.27లక్షల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు, ధ్రువపత్రాల అందజేత

జులైవాడ: హనుమకొండ బస్టాండులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగును మంగళవారం ఆర్టీసీ సిబ్బంది అందజేశారు. శాయంపేట మండలం కొత్తపల్లికి చెందిన ఆరె సాగర్ బస్టాండులో తన బ్యాగును మరచిపోయి ఊరికి వెళ్లారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ నవీన్ దాన్ని గుర్తించి, పరిశీలించగా అందులో రూ.2410 నగదు, పలు ధ్రువపత్రాలు ఉండటంతో, అందులోని వివరాల ప్రకారం బాధితుడికి సమాచారం ఇచ్చారు. బస్టాండులో బ్యాగును హెడ్ కానిస్టేబుల్ రవి చేతులమీదుగా అందించారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

మామునూరు: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ ఐనవోలు మండలం నర్సింహులగూడేనికి చెందిన కట్కూరి పుల్లమ్మ (45)గా గుర్తించారు. ఈ నెల 12న అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో ఆచూకీ తెలియరాలేదు. కొంతకాలంగా శంభునిపేటలో నివాసముంటున్నారని మామునూరు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


ములుకనూర్‌లో..


కేయూలో..


కలాం సలాం..అంటూ మడికొండ ఏకశిల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


ముచ్చర్లలో..

భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉపాధ్యాయులు ఉద్బోధించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. –న్యూస్‌టుడే యంత్రాంగం

17న గాయకుల ఎంపిక

బాలసముద్రం, న్యూస్‌టుడే : హనుమకొండ కేయూసీ బైపాస్ రోడ్డులోని శారద వేడుకల మందిరంలో ఈ నెల 17న గాయకుల ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్లె చరిత్ర, మానవీయ జీవన శైలి గురించి చాటిచెప్పే విధంగా యాస, భాషతో కూడిన విలువైన సాహిత్యాన్ని భావితరాలకు అందించడం కోసం 'నూరేండ్ల నాఊరు' అనే గేయ కావ్యాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. 243 చరణాలతో రచించి 243 మందితో పాడించాలనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎంపికలకు హాజరు కావాలన్నారు.

18న గీత కార్మిక సంఘం వార్షికోత్సవం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం ఈ నెల 18న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం కాజీపేటలో గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. అతిథులుగా రాష్ట్ర మంత్రు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం గౌడ్ హాజరు అవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని గీత కార్మికులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబరాజు, వెంకటేశం, రాజు, రవి, వేణు, లక్ష్మీనారాయణ, రాజు, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ఐనవోలు, న్యూస్‌టుడే: చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ విక్రమ్‌కుమార్, నీటిపారుదల శాఖ డీఈ శంకర్ చౌహాన్ ఆదేశించారు. మంగళవారం పంథిని, పున్నేలు గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను వారు పరిశీలించి, నోటీసులు జారీ చేశారు. పంథిని రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 331లోని కాలువ నీరు పారే ప్రాంతంలో చేపట్టిన వేడుకల భవన నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బాలాజీ రైస్ మిల్లు ప్రహరీని కూల్చాలని సూచించారు. నాగుల చెరువు బఫర్‌జోన్‌లో చిరువ్యాపారుల దుకాణాలను తొలగించాలని రెండోసారి నోటీసులు అందజేశారు. పున్నేలు శివారులోని ధరణి వెంచర్‌లో చెరువు ప్రాంతంలో చేపట్టిన ప్రహరీని తొలగించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి మాలతి, సర్వేయర్ సూరజ్, నీటిపారుదల శాఖ ఏఈ, ఆర్ఐ పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన జడ్పీ సీఈవో

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: దండేపల్లి, చింతలపల్లి, గోపాల్‌పూర్ గ్రామాల్లో జడ్పీ నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్డు, మురుగు కాలువ పనులను మంగళవారం సీఈవో విద్యాలత పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భారాస ఎస్సీ సెల్ కోఆర్డినేటర్‌గా మహేందర్

వేలేరు, న్యూస్‌టుడే: భారాస ఎస్సీ సెల్ నియోజవర్గ కోఆర్డినేటర్‌గా పీచరకు చెందిన కొయ్యడ మహేందర్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన అతడి సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

ఐనవోలు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మంగళవారం పీఆర్టీయూ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంఘం ప్రకటించిన పింగిలి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంఈవో పులి ఆనందం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం విజేతలకు బహుమతి

కాజీపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రైల్వే ఇనిస్టిట్యూట్(క్లబ్) ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. క్లబ్ ఛైర్మన్, సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ కార్యదర్శి దేవులపల్లి రాఘవేందర్, కోశాధికారి గిరిమిట్ల రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు


రమేశ్‌కు నచ్చచెప్పి తీసుకొస్తున్న మడికొండ పోలీసులు

మడికొండ: ఇంట్లో గొడవలతో మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన యువకుడిని మడికొండ పోలీసులు కాపాడారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మదనపల్లికి చెందిన రాసమల్ల రమేశ్ (27) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల దసరాకు ఇంటికి వచ్చిన అతను పండుగ రోజు రాత్రంతా కుటుంబ సభ్యులతో గొడవ పడ్డారు. ఆవేశంతో వాట్సాప్ వీడియో, సూసైడ్ నోట్ రాసుకుని మడికొండ శివారు అయోధ్యపురం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని మంగళవారం ఉదయం వచ్చారు. స్థానికులు గమనించి డయల్ 100కు ఫోన్‌చేయడంతో బ్లూకోల్ట్స్ హెడ్ కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసు అక్కడకి చేరుకొని అతడికి నచ్చచెప్పి ఠాణాకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి అప్పజెప్పారు.

సీఐటీయూలో చేరిక

విద్యానగర్: కాకతీయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు 40 మంది మంగళవారం సీఐటీయూలో చేశారు. జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, విశ్వవిద్యాలయాల కార్మిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చిరంజీవి, రామచందర్, రవికుమార్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పుర కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

బాలసముద్రం, న్యూస్‌టుడే : పుర కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించే వరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. రాంనగర్‌లోని సీఐటీయూ భవన్‌లో మంగళవారం తెలంగాణ పుర కార్మికులు, ఉద్యోగుల సంఘం హనుమకొండ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బల్దియాతో పాటు పలు ప్రభుత్వరంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్స్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. అనంతరం అధ్యక్షుడిగా ఇమ్మడి సాగర్, కార్యదర్శిగా యాస బాబు, గౌరవ అధ్యక్షుడిగా టి.ఉప్పలయ్య, గౌరవ సలహాదారులుగా కృష్ణ స్వామి, మారపాక అనిల్, శ్యామ్, కోశాధికారిగా మాతంగి నవనీతను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మద్యం తాగి విధులకు వస్తున్నారని ఫిర్యాదు

కమలాపూర్: మరిపల్లి పంచాయతీ కారోబార్ మద్యం తాగి విధులకు హాజరవుతున్నట్లు మాజీ సర్పంచి చందుపట్ల రజిత మంగళవారం ఎంపీడీవో బాబుకు ఫిర్యాదు చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ చెక్కు పుస్తకాల మాయంలో ఆయన ప్రమేయం ఉందని పేర్కొన్నారు. దీనిపై ఎంపీడీవోను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఫిర్యాదుపై విచారణ కోసం ఎంపీవో రవికి ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడి నియామకం

ధర్మసాగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ధర్మసాగర్ మండల అధ్యక్షుడిగా ఉనికిచర్లకు చెందిన మైస ఏలియాను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆన్‌లైన్ రేటింగ్ పేరిట రూ.95 వేలు మోసం

ఎల్కతుర్తి : ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో రేటింగ్ ఇస్తే రూ.వేలు సంపాదించవచ్చని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.95 వేలు మోసం చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన సింధూ చరవాణికి మేసేజ్ వచ్చింది. గుగూల్ రేటింగ్ చేస్తే డబ్బులు వస్తాయని అందులో ఉంది. ముందుగా కొంత డబ్బు జమ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో ఆమె విడతల వారీగా రూ.95 వేలు ఫోన్‌పే చేశారు. రేటింగ్ ఇచ్చారు. డబ్బులు రాకపోవడంతో అవతలి వ్యక్తులకు ఫోన్ చేస్తే.. మీకు క్రెడిట్ తక్కువగా ఉందని, ఇంకొంత డబ్బు పంపించమనడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డాలర్లు జమ అయ్యాయని..

నీకు రావాల్సిన డబ్బులు డాలర్లలో జమ అయ్యాయని, జీఎస్టీ, సేవా రుసుం చెల్లిస్తే మీకు డబ్బులు వస్తాయంటూ నమ్మించి రూ.34,847 సైబర్ నేరం జరిగినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌కు చెందిన కడారి రంజిత్‌కుమార్ తన చరవాణికి వచ్చిన లింక్‌ను తెరిచారు. రూ.5 వేలు పంపిస్తే రూ.15 వేలు వస్తాయని అవతలి వ్యక్తులు నమ్మించారు. రూ.5 వేలు పంపగా.. కొద్దిసేపటికే మీకు రూ.40వేలు వచ్చాయంటూ మేసేజ్ పంపారు. మళ్లీ డబ్బులు పంపిస్తే రెట్టింపు వస్తాయంటే ఆశతో విడతలవారీగా రూ.34,847 పంపించాడు. డబ్బు రాలేదని ఫోన్ చేసి అడగ్గా డాలర్లలో జమ అవుతాయని, జీఎస్టీ రూ.3వేలు, ఇతర సేవల కోసం రూ.2 వేలు పంపిస్తే సరిపోతుందన్నారు. మోసపోయానని గ్రహించిన రంజిత్‌కుమార్ మంగళవారం పోలీసులకుఫిర్యాదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట సెయింట్ జాన్స్ పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రిన్సిపల్ సాంటోస్, ఉపాధ్యాయులు సైదా, సలీనా, అన్వర్, గిరిజా, పద్మావతి, రవిప్రసాద్‌ను సత్కరించారు.

చేతుల శుభ్రతపై అవగాహన



ఐనవోలు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల పరిషత్ అధికారులు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఆనందం, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ సంపత్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, విద్యావారధి అధ్యక్షుడు భీమళ్ల సారయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న పీడీ నాగపద్మజ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పెద్దచెరువును ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగపద్మజ, అదనపు జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి శ్రీనివాసరావు. తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కొందరు ఈ భూమిని ఆక్రమించుకున్నారని పలువురు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం పక్కన సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని వచ్చిన ఫిర్యాదు మేరకు తగిన అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో రాజిరెడ్డి, ఈసీ శ్రీధర్, రాము, టీఏలు తదితరులు ఉన్నారు..

బాధితులకు సాంత్వన చేకూర్చాలి


అధికారులతో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

దామెర, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సిబ్బంది సాంత్వన చేకూర్చాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. మంగళవారం దామెర పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది గౌరవ వందనం అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. కేసులకు సంబంధించిన రికార్డులతో పాటు, సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సిబ్బంది నిజాయతీతో పనిచేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ధైర్యాన్నివ్వాలన్నారు. కేసుల దర్యాప్తులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆయన సూచించారు. ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన సూచించారు. వీరి వెంట డీసీపీ రవీందర్, ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

పరకాల నియోజకవర్గం

అబ్దుల్ కలాంకు నివాళులు

పరకాల: పరకాల ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్‌లు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఆత్మకూరు: స్థానిక రైతు వేదిక వద్ద గత సంవత్సరం రూ.5 లక్షల నిధులతో మరుగుదొడ్లు నిర్మించారు. కానీ గుత్తేదారుడికి బిల్లులు రావడం లేదని తాళాలు వేశారు. దీంతో రైతు వేదిక వద్దకు వచ్చే రైతులకు, మహిళా ఏఈవోలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం



పరకాల, న్యూస్‌టుడే: పరకాల నుంచి బదిలీపై వెళ్లిన ఎన్పీడీసీఎల్‌కు చెందిన పలువురు అధికారులను మంగళవారం సాయంత్రం ఇక్కడ ఘనంగా సన్మానించారు. పట్టణ ఏఈ సత్యనారాయణ, లైన్‌మెన్లు ఇంజపెల్లి శ్రీనివాస్, భూక్య సోమ్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు మల్లిఖార్జున్, సతీష్‌లు పలు చోట్లకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, సిబ్బందితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలందజేశారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులు

శాయంపేట, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్, కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ సాయిబాబాకు ఇక్కడ నివాళులర్పించారు. ప్రధాన కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాదాలు చేశారు. కార్యక్రమంలో అరికిల్ల దేవయ్య, ముక్కెర ముఖేష్, భరత్ చంద్ర, కొమ్ముల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.